దాక్కున్నానని చెప్పాడు. శుభ్రంగా మూడు షోలు చూసి రాత్రిళ్ళ కర్టెన్ వెనకాల దాక్కునేవాడట. హాలునిండాక కర్టెన్ లేవబోయేముందు ప్రేక్షకుల్లో కలిసిపోయేవాడట. 'ఆ సినిమా చూసి చూసి బోరు కొట్టబట్టి వచ్చాను మమ్మీ' అన్నాడా భడవాయ్.

సినిమా హాల్స్ కర్టెన్ మీద కూడా ఓ ముతక జోకుంది. మొగ కర్టెన్స్ పైకి లేస్తే ఆడ కర్టెన్సు రెండూ పక్కలకి తొలగుతాయట!

సినిమా హాలుకి సంబంధించిన చాలామందికి తెలిసిన జోక్ రాస్తే కాని ఈ వ్యాసం పూర్తయినట్లు కాదు. 'సారి. ఇందాక వెళ్తూ మీ కాలు తొక్కానా?' అని ఒకడు ఇంటర్వెల్‌లో ఓ వరసలో మొదట కూర్చుని ఉన్నతన్ని అడిగితే అతను అవునంటే 'అయితే ఈ వరసలోనే అన్నమాట మన అయిదు, ఆరు సీట్లు' అని ఆ ప్రశ్న అడిగినతని భార్య మెల్లిగా చెప్పింది.

# ఓ లాయర్ బత్తాయి పండు ఇస్తే....

లాయర్ అవసరం రానివాళ్ళు అదృష్టవంతులు. వచ్చిన వాళ్ళకే తెలుస్తుంది లాయర్ అంటే ఏమిటో. ఎక్కడ బాధ, ఫ్రస్టేషన్ వుంటే అక్కడ జోక్స్ సృష్టించబడతాయి. (ఉదాహరణకి కమ్యూనిస్టు రష్యాలో కమ్యూనిజంమీద, నియంతమీద అనేక జోకులు పుట్టాయి.) అలాగే లాయర్లతో విసిగిపోయిన వారు లాయర్లమీద చాలా జోకులు పుట్టించారు.

కోర్టుకెళ్ళిన ఓ పెద్దమనిషి లాయర్‌ని దృష్టిలో వుంచుకుని చెప్పిన మాట. 'నా జీవితంలో రెండుసార్లు నష్టపోయాను. కోర్టులో నేను ఓడిపోయినప్పుడోసారి, గెలిచినప్పుడోసారి' అని.

లాయరంటే విసిగిపోయిన ఇంకో పెద్దమనిషి చెప్పిన జోక్: బ్రిటన్‌లో ఓ లాయరు ఓ బాతుని తుపాకితో కాలిస్తే లేండ్‌లార్డ్

లాయర్‌తో చెప్పాడు, అతను ప్రైవేట్ ప్రాపర్టీలోని వున్నాడని, ఆ బాతు తనదవుతుందని. లాయర్ కాబట్టి సహజంగానే ఆర్గ్యూ చేశాడు.

"ఆ బాతు గాల్లో ఎగురుతుండగా కాల్చాను. ప్రాపర్టీ మీద వున్న గాలి మీద ఎవరికీ హక్కుండదు. నేను కాల్చాను కాబట్టి ఆ బాతు నాదే అవుతుంది".

లేండ్‌లార్డ్ ఆలోచించి చెప్పాడు "అయితే ఈ వివాదాన్ని ప్రాంతీయ పద్ధతిలో తేల్చుకుందాం"

"అదేమిటి?" అడిగాడు లాయరు ఆసక్తిగా.

"నేను మొదట మిమ్మల్ని పొట్టలో తంతాను. తర్వాత మీరు నన్ను తన్నండి. ఇలా యిద్దరిలో ఒకరు 'యికవద్దు' అనే దాకా తన్నుకుందాం. ఎవరు వద్దంటే వారు ఈ వివాదంలో ఓడిపోయినట్లు".

లాయర్ తోలుతో చేసిన హంటింగ్ బూట్లు తొడుక్కొని వున్నాడు. లేండ్‌లార్డ్ మృదువయిన రబ్బర్‌తో చేసిన బూట్లు తొడుక్కొని వుండటం గమనించి వెంటనే ఆ పరిష్కారానికి నవ్వుకున్నాడు. లేండ్ లార్డ్ మొదటగా లాయర్ పొట్టలో గట్టిగా తన్నాడు. కిందపడ్డ లాయర్ బాధతో పదినిముషాలసేపు లేవలేకపోయాడు. లేచాక చెప్పాడు.

"కదలక. ఇప్పుడు నా వంతు".

"ఇక వద్దు. బాతుని నువ్వే తీసుకో!" జవాబు చెప్పాడా లేండ్‌లార్డ్.

లాయర్ వృత్తి మీద ఇలా చాలామందికి కోపం వుండటానికి కారణం కోర్టులో వివాదలలో ఎప్పుడూ ఓ పార్టీ గెలిస్తే ఇంకో పార్టీ ఓడిపోవడమే. ఓడిపోయిన వాడికి తన లాయర్ మీద కోపం వుండటం సహజం. సరిగ్గా వాదించలేదని అనుమానపడడం యింకా సహజం. కొండొకచో ఎదురు పార్టీనించి డబ్బు తిని తను ఓడటానికి బాధ్యుడయ్యాడని కూడా అనుమానపడటం జరుగుతుంటుంది, ఇందులో నిజం లేకపోయినా. దాంతో ఓడిన వాళ్ళంతా లాయర్ అంటే కోపంగా వుండటం సర్వసాధారణం. 'ఫీజుపోయే కేసుపోయె' అని బాధపడుతారు. దాంతో లాయర్‌లలో అధికశాతం దుర్మార్గులనే అనుకుంటారు ప్రజలు.

లాయర్ మీద ప్రజలకుండే యింకో దురభిప్రాయం కేసులని

సంవత్సరాల తరబడి సాగదీస్తారని. 'వేర్ దేరీజ్ ఏ విల్, దేరీజ్ ఏ వే' అన్నది ఇంగ్లీషు నానుడి. ఓవన్‌స్టర్ దీన్ని ఇలా చెప్పాడు. 'వేర్ దేరీజ్ ఏ విల్ (వీలునామా) దేరీజ్ ఏ డిలే'.

ఇంకో లిటిగెంట్ తన స్వానుభవంతో యిలా సలహా యిచ్చాడు. 'చట్టం క్షుణ్ణంగా తెలిసిన లాయరు నీకు దొరక్కపోతే, జడ్జిని క్షుణ్ణంగా తెలిసిన లాయర్‌ని పట్టుకో.'

లాయర్‌లని నల్లకోటులో లేకపోయినా కనుక్కోవడం తేలికే. ఓ ఆటోలో ముగ్గురు మనుషులు ఎక్కారు. వాళ్ళలో ఒకడు చెప్పాడు డ్రయివర్‌తో.

"మా ముగ్గురిలో ఎవరు లాయరో కనుక్కోగలిగితే నీకు పంద రూపాయలు యిస్తాను".

"నాకు పందేలంటే ఇష్టం వుండదు" చెప్పాడా డ్రయివర్.

"ఎందుకని?" అడిగాడు ఆ ముగ్గురిలోని ఒకడు వెంటనే.

"మీరే లాయర్" చెప్పాడు ఆ తెలివయిన ఆటో డ్రయివర్ వెంటనే. లాయర్లకి యిలా క్రాస్ క్వశ్చన్స్ వేయడం పరిపాటి కాబట్టి కనిపెట్టేసాడా డ్రైవర్.

ఓసారి ఓ న్యూయార్కు లాయర్ ఓ కేసు గెలిచాడు. అతని క్లయింట్ లిఫ్ట్ తీసేసిన షేఫ్ (గొయ్యి)లోపడి దెబ్బలు తినడం వల్ల ఆ బిల్డింగ్ యజమాని మీద నష్టపరిహారానికి వేసిన కేసులో గెలిచాడు.

లాయర్ యిచ్చిన బిల్లు చూసి 'ఇందులో న్యాయం లేదు సార్. నా కొచ్చే నష్టపరిహారంలో మూడోవంతు మీరు తీసేసుకుంటున్నారు' అన్నాడు క్లయింట్.

"అవును. నేను నీ కేసు గెలవడానికి తగ్గ నైపుణ్యం, నాలెడ్జ్, చట్టం తెలిసివున్న వాణ్ణి కాబట్టే నువ్వా కేసు గెలిచావ్" చెప్పాడా లాయర్.

"కానీ మీకీ కేసు యిచ్చింది నేను" గుర్తుచేశాడు ఆ క్లయింట్.

"దాందేముంది. ఎవరయినా లిఫ్ట్ షేఫ్ట్‌లో పడచ్చు కాని నైపుణ్యం, నాలెడ్జ్, చట్టం తెలియడం ఒక్క లాయర్ స్వంతమే" వాదించాడా లాయర్.

కొందరు క్లయింట్స్ లాయర్ల కన్నా తెలివిగల వాళ్ళయి వుంటారు. ఓ విడాకుల కేసులో ఓ భార్య తన భర్త నుంచి రావాల్సిన భరణం గురించి మాట్లాడుతోంది. లాయర్ ఆమె చెప్పేది విని చెప్పాడు.

"మిసెస్ కమలగారు, మీ భర్త ఆస్తిలో సగం మీకు లభించే సెటిల్‌మెంట్ చేసాను. ఇందులో యిద్దరికి న్యాయం జరుగుతుందని మీ భర్తని వప్పించాను."

అందుకామె మండిపడుతూ చెప్పింది.

"ఇద్దరికీ న్యాయం జరగడమా? ఆ పాటి చేయడం నాకు రాదనుకున్నారా? అసలు నేను లాయర్‌ని ఎందుకు పెట్టుకున్నాననుకున్నారు?"

సాధారణంగా లాయర్లు మామూలు జనానికన్నా చాలా విషయాల్లో జాగ్రత్తగా వుంటారు. కారణం వాళ్ళకి లా అంతా క్షుణ్ణంగా తెలుసు కాబట్టి. ఓ కుర్రాడు తన ప్రియురాలికి రోజుకో ప్రేమలేఖ రాసేవాడు. ఆర్నెల్ల తర్వాత చటుక్కున వాటిని ఆపేసాడు. ఆమె కారణం అడిగితే ఆ లా చదివే కుర్రాడు చెప్పిన జవాబు.

"ఇప్పుడు బ్రీచ్ ఆఫ్ ప్రామిస్ ఛాప్టర్ క్లాసులో చెప్తున్నారు కాబట్టి".

లాయర్‌కి, మామూలు జనానికి యింకో తేడా కూడా వుంది. లాయర్ కాని వ్యక్తి బత్తాయి పండుని యింకొకళ్ళకిస్తే 'ఇదిగో బత్తాయి తీసుకో' అంటాడు. అదే లాయర్ యిస్తే 'ఈ బత్తాయిని నీకు దీని తొక్కా, తోలు, రసం, గింజలు, గుజ్జుతో సహా, దాన్ని కొరకడానికి, కొయ్యడానికి, పీల్చడానికి, నాకడానికి, నమలడానికి. పిండడానికి లేదా యింకే విధంగానయినా తినడానికిగాని, లేదా అమ్మడానికి గాని లేదా మూడో వ్యక్తికి తొక్క, తోలు, రసం, గింజలు, గుజ్జుతో సహా కాని వాటిలో అన్ని లేదా కొన్ని లేకుండా కాని దానం చేయడానికి కాని, ఎక్స్చేంజ్ చేయడానికి గాని సంపూర్ణ దానాదమన వినిమయ విక్రయ హక్కులతో ఎవరినించి ఎలాంటి వత్తిడి కాని, నిఘాకాని లేకుండా, మంచి బుద్ధితో ఆలోచించి యిస్తున్నాను. ఇకమీదట నేను కాని, నా వారసులు కానీ, నా తరఫున వారు కాని దీని విషయంలో ఎలాంటి ఫేచీ

పెట్టరని నిన్ను నమ్మించి యిస్తున్నాను" అని యిస్తాడు.

విల్లు రాసేప్పుడు లాయర్ అవసరం వస్తుంది, పైన ప్రదహ రించిన రీతిలో విల్లుని పకడ్బందీగా రాయాలి కాబట్టి. తన లక్షల ఆస్తికి సంబంధించిన విల్లు విషయంలో వర్రీ అవుతున్న ఓ ముసలాయనతో చెప్పాడు లాయర్.

"వర్రీ అవకండి. అంతా నా కొదలండి చెప్తాను".

"అంతేనంటారా?"

"అంతే"

లాయర్ అన్న మాటప్రకారం ఆ ముసలాయన విల్లులో తన ఆస్తి అంతా ఆ లాయర్‌కే వదిలాడు!

లాయర్లంటే అబద్ధాల కోర్లు అనే నమ్మకం చాలా మందిలో వుంది. ఓ జడ్జి ముద్దాయిని ఓసారి అడిగాడు. నీకు లాయర్ కావాలా అని. అందుకు ఆ ముద్దాయి 'అక్కర్లేదండి. నేను నిజమే చెప్పదలచు కున్నాను' అన్నాడట. లయ్యర్‌కీ, లాయర్‌కీ వుచ్చారణ దగ్గరగా లేదు? ఒకోసారి క్రాస్ ఎగ్జామినేషన్‌లో లాయర్లకన్నా తెలివయిన సాక్షులు తారసపడుతుంటారు. ఉదాహరణకి_

లాయర్: నీకు పెళ్ళయిందా?

సుబ్బారావు: అయింది.

లాయర్: ఎవరితో?

సుబ్బారావు: ఓ అమ్మాయితో.

లాయర్: ఆ సంగతి నాకు తెలుసు. ఎవరూ మగాణ్ని పెళ్ళి చేసుకోరు.

సుబ్బారావు: ఎందుకు చేసుకోరు? మా చెల్లాయ్ మగాణ్ణే పెళ్ళి చేసుకుంది.

లాయర్ల మీద కోపాన్నంతా ఓ పెదమనిషి ఈ జోక్‌లో ఘొందు పరిచాడు.

అతను: ఎలుకలు పోయే మందుందా?

మందులషాపతను: ఈ ధాగి ఎలుకని మీ ఇంటికి తీసుకెళ్ళండి.

దాన్ని నేలమీద మూడుసార్లు కొట్టి గోదావరి వైపు నడవండి. మీ వెనక మీ వూళ్ళోని ఎలుకలన్నీ వస్తాయి. ఈ రాగి ఎలుకని గోదావరిలోకి విసిరేయండి. ఎలుకలన్నీ గోదావరిలో మునిగి చస్తాయి.

అతను: నువు చెప్పేది నమ్మమంటావా?

మందులషాపతను: ప్రయత్నించి చూడండి. పని చెయ్యకపోతే డబ్బు వాపస్.

గంటన్నర తర్వాత అతను ఎంతో ఎక్సయిటింగ్‌గా పరిగెత్తు కొచ్చాడు.

మందులషాపతను: నేనిచ్చిన రాగి ఎలుక పనిచేసిందాసార్?

అతను: అహ. ముందు ఇది చెప్పండి. మీ దగ్గర రాగి లాయర్లు కూడా వున్నాయా?

# ఎలక్షన్ జోక్స్

ఎన్నికలని కవులు పూర్వం 'ఎన్నెన్నో కలలు' అన్నారు. నిజమే. ఆ రోజుల్లో కొత్త ప్రభుత్వం మీద ఆశతో కలలు కనేవారు. కాని అన్ని పొలిటికల్ పార్టీలు, అన్ని ప్రభుత్వాలు ఆ కలలని, ఆ ఆశలను వమ్ము చేస్తూ వస్తున్నాయి కాబట్టి ఓ విధమైన నిరాశావాదం ప్రజల్లో ప్రభుత్వాల మీద, రాజకీయ నాయకులమీద ప్రబలింది. ప్రభుత్వ ఫెయిల్యూర్స్‌కి ఇండెక్స్ మనదేశంలో తరచూ చెలరేగే ఆందోళనలు, బంద్‌లు, సమ్మెలు, రాస్తారోకోలు, జైల్‌భరోలు, బాంబు దాడులు, ఉద్రేకపూరితమైన స్టేట్‌మెంట్స్, టెర్రరిస్టులు, నక్సలైట్లు.

సీరియస్‌గా ఇలా ఎంత రాసినా రాయచ్చు. బట్, కాసేపు ఎన్నికలని తలచుకొని సరదాగా నవ్వుకొందాం. 'ఎవరొచ్చినా స్విస్ బేంకుల్లోకి వెళ్ళే డాలర్లలో మార్పుండదు, అకౌంట్ నంబర్లలో తేడా మాత్రమే' అన్నది నా నిశ్చితాభిప్రాయం.

***